సాక్షి అనకాపల్లి

గురువారం । 5 । డిసెంబర్ । 2024




పుస్తకావిష్కరణ

విశాఖ విద్య: ఏయూ విద్యా విభాగంలో పరిశోధన పత్రాల సంకలనం 'బియాండ్ ది క్లాస్‌రూమ్'ను బుధవారం వీసీ శశిభూషణరావు ఆవిష్కరించారు.



వలిసె పూల సోయగం

సాక్షి,పాడేరు: ముంచంగిపుట్టు మండలం దిగువకుమడ ఘాట్‌లో వలిసెపూల తోటలు ఎంతగానో ఆకర్షిస్తున్నాయి.



సిరుల తల్లికి ప్రణమిల్లి

విశాఖ: మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా కనకమహాలక్ష్మి సన్నిధిలో తొలి గురువారం పూజలు అర్ధరాత్రి ప్రారంభమయ్యాయి.

న్యూస్‌రీల్

పోలీస్‌స్టేషన్లకు డ్రోన్లు..

- శిక్షణ పొందిన సిబ్బందికి ఎస్పీ చేతుల మీదుగా అందజేత



పోలీస్ సిబ్బందికి డ్రోన్లు అందజేస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: అసాంఘిక కార్యకలాపాల కట్టడి, నేరాలు, ట్రాఫిక్ నియంత్రణకు జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లకు డ్రోన్లు తీసుకొస్తున్నామని ఎస్పీ తుహిన్ సిన్హా చెప్పారు. బుధవారం తన కార్యాలయంలో శిక్షణ పొందిన పోలీస్ సిబ్బందికి డ్రోన్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించడానికి, రద్దీ సందర్భాల్లో సమర్థంగా బందోబస్తు నిర్వహించడానికి ఈ డ్రోన్లు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి డీఎస్పీ శ్రావణి, సీఐ పైడపునాయుడు, ఎస్సై మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

డీఆర్వో దయానిధికి వీడ్కోలు సత్కారం



దయానిధిని సత్కరిస్తున్న కలెక్టర్, జేసీ

తుమ్మపాల: జిల్లా రెవెన్యూ అధికారిగా విలువైన సేవలు అందించి దయానిధి తన కర్తవ్యాన్ని బాధ్యతాయుతంగా నిర్వహించారని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. జిల్లా నుంచి బదిలీ అయిన ఆయన ఈ నెల 5న కలెక్టరేట్ నుంచి రిలీవ్ కానున్న నేపథ్యంలో కలెక్టర్, జేసీ జాహ్నవి, జిల్లా వివిధ విభాగాల అధికారులు ఆయన సేవలను కొనియాడుతూ ఘనంగా సత్కరించారు. ఎన్నికల ప్రక్రియ, ఫ్రీహోల్డ్ భూములు, ఓటర్ల జాబితా తయారీ వంటి వాటిని సక్రమంగా నిర్వర్తించారన్నారు. దయానిధి బదులిస్తూ.. జిల్లాలో సుదీర్ఘకాలం డీఆర్వోగా విధులు నిర్వర్తించడం ఆనందాన్నిచ్చిందన్నారు.

ప్రశాంతంగా ఎన్‌ఏఎస్ పరీక్షలు

అనకాపల్లి: జిల్లాలో 84 పాఠశాలల్లో బుధవారం నేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వే (ఎన్‌ఏఎస్) పరీక్షలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించినట్లు డీఈవో గిడ్డి అప్పారావునాయుడు చెప్పారు. మూడో తరగతి విద్యార్థులు 667 మంది, ఆరో తరగతి నుంచి 700 మంది, 9వ తరగతి నుంచి 936 మంది పరీక్షలు రాసినట్టు చెప్పారు. మొత్తం 2579 మంది విద్యార్థులకుగాను 2303 మంది హాజరయ్యారన్నారు.

నేడు సీఎం రాక

మహారాణిపేట (విశాఖ): రెండు రోజుల విశాఖ పర్యటన కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం విశాఖ వస్తున్నారు. గురువారం రాత్రి 9.30 గంటలకు ముంబయి నుంచి విమానంలో విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి రామ్‌నగర్‌లోని టీడీపీ కార్యాలయానికి చేరుకొని అక్కడ రాత్రి బస చేస్తారు. శుక్రవారం నగరంలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు.

నేడు సీఎస్ రాక : రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ గురువారం విశాఖ వస్తున్నారు. విజయవాడ నుంచి విమానంలో గురువారం ఉదయం 8.35 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. ప్రభుత్వ అతిథి గృహంలో విశ్రాంతి తీసుకున్న అనంతరం నగరంలో ఒక ప్రైవేటు హోటల్‌లో జరగనున్న డీప్‌టెక్, గవర్నమెంట్ టెక్నాలజీ ఇన్నోవేషన్ కాంక్లేవ్-2024లో పాల్గొంటారు.

పుష్కలంగా వైద్య సిబ్బంది.. 104, 108 సేవలకు అధునాతన వాహనాలు.. సరిపడినన్ని మందులు.. అత్యవసర సేవలకు ఇంటికే వచ్చి వైద్యం అందించే 'ఫ్యామిలీ ఫిజీషియన్'.. ఇవి ఆరు నెలల క్రితం వరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు అందిన వరాలు..

స్పెషలిస్టు వైద్యుల తొలగింపు.. 104, 108 సిబ్బంది ఆందోళనలు.. గత ప్రభుత్వం సమకూర్చిన కొత్త పరికరాలను వినియోగించకుండా మూలపడేసిన నిర్లక్ష్యం.. వైద్యరంగంపై చిన్నచూపు.. ఇవి ప్రస్తుతం కూటమి సర్కారు హయాంలో జనాన్ని వేధిస్తున్న శాపాలు..

కనీసం సరిపడినన్ని మందులను సరఫరా చేయాలన్న ధ్యాసయినా లేని ప్రభుత్వంలో ఆస్పత్రుల పరిస్థితి దీనాతిదీనం.. సామాన్యుల బతుకు రోగగ్రస్తం..

ఇంజక్షన్లకే రోజుకు రూ.2 వేలు



అనకాపల్లి మండలం సీతానగరం గ్రామానికి చెందిన ఆళ్ల పెంటారావుకు కాలు, చేయి పడిపోవడంతో ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రికి తీసుకొచ్చారు. నవంబర్ 30న డాక్టర్లు పరీక్షించి పక్షవాతం అని నిర్ధారించారు. వార్డులో చేర్చుకొని వైద్యం అందిస్తున్నారు. కానీ ఇంజక్షన్లు, మందుల కొరత ఎక్కువగా ఉండడంతో బయట నుంచి తెచ్చుకోమంటున్నారు. పిరాసెటమ్ ఇంజక్షన్, సిటికొలైన్ ఇంజక్షన్, లెవో కార్టినిటైన్ టాబ్లెట్స్, మొడాఫినైల్ టాబ్లెట్స్ ఇక్కడ ఆస్పత్రిలో లేకపోవడంతో బయట కొనుగోలు చేస్తున్నామని బాధితుడి కుమారుడు మహేష్ చెప్పారు. రోజుకు రూ.2 వేల వరకు ఇంజక్షన్లకే ఖర్చవుతోందని వాపోయారు. గత నాలుగు రోజులుగా మందులు తెచ్చుకుంటున్నామని చెప్పారు.



బాధితుడు పెంటారావు

ఆరు మందులు రాస్తే.. మూడు రకాలే ఉన్నాయి..



పదేళ్ల క్రితం పడిపోవడంతో కుడి భుజం దెబ్బతింది. అప్పట్లో ఆపరేషన్ చేశారు. చీడికాడ పీహెచ్‌సీకి వెళితే ఎన్టీఆర్ ఆస్పత్రికి వెళ్లమన్నారు. దీంతో మంగళవారం జిల్లా ఆస్పత్రికి వచ్చి చూపించుకున్నాను. డాక్టర్ బాబు 6 రకాల మందులు రాశారు. కానీ ఇక్కడ మూడు మందులు మాత్రమే ఇచ్చారు. దీంతో బయట కొనుక్కున్నాను.

-కె.యర్రయమ్మ, మంచాల గ్రామం, చీడికాడ మండలం

జిల్లా ఆస్పత్రికి వచ్చినా ఫలితం శూన్యం



మా పాప ఎస్.గ్రీష్మకు చెవి నొప్పి, దగ్గు, జ్వరం ఉండడంతో చోడవరంలో ప్రభుత్వ ఆస్పత్రిలో చూపించాం. నాలుగు రోజులు మందులు వాడినా తగ్గలేదు. ఎన్టీఆర్ ఆస్పత్రికి ఈ రోజు వచ్చి ఓపీలో చూపించుకుంటే డాక్టర్లు రక్త పరీక్షలు, ఎక్స్‌రే రాశారు. నాలుగు రకాల మందులు రాశారు. వీటిలో మూడు రకాలు ఇచ్చారు. లెవో సిట్రిజన్ టాబ్లెట్స్ లేవన్నారు. బయట మందుల షాపులో తీసుకున్నాను.

- ఎస్.నాగేష్, అన్నవరం గ్రామం, చోడవరం మండలం

మందు బిళ్ల బరువాయె..

సూది మందు కరువాయె..



గ్రాండ్ సాక్షి రిపోర్ట్

సాక్షి, అనకాపల్లి:

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందుల కొరత ఎక్కువగా ఉంది. డాక్టర్లు పరీక్షించి మాత్రలు, టానిక్‌లు, ఇంజక్షన్లు రాస్తున్నారు గానీ అందులో సగం కూడా స్టాక్ లేని పరిస్థితి. ఇండెంట్ పెట్టాం.. మందులు రావాలని సిబ్బంది చెబుతున్నారు. ఆస్పత్రిలో మందులు ఇవ్వక, బయట కొనుక్కోలేక పేదలు సతమతమవుతున్నారు. 'సాక్షి' విలేకరుల బృందం జిల్లాలోని ఆస్పత్రులను విజిట్ చేయగా 40 శాతం మందుల సరఫరా లేదని తేలింది. ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రిలో సర్జికల్ గ్లాస్ కొరత కాటన్ ఐవీ కాన్యులా, అనస్తీషియా కోసం వాడే స్పైనల్ నీడిల్స్, శస్త్రచికిత్సలు, క్షతగాత్రులకు కుట్లు వేయడానికి మెటీరియల్ కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి, నక్కపల్లి, కె.కోటపాడు, కోటవురట్ల, మాడుగుల, చోడవరం సీహెచ్‌సీల్లో అరకొరగానే మందులున్నాయి. సర్జరీ గ్లౌజ్‌లు, ఇంజక్షన్లు, మందులు ఇండెంట్ పెట్టిన వాటిలో సగమే వస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరు నెలలు తిరక్కుండానే మందుల నిల్వలు పూర్తిగా కరిగిపోయాయని సామాన్యులు వాపోతున్నారు. అసలే తరుచూ వర్షాలు కురవడంతో సీజనల్ జ్వరాలు ఎక్కువయ్యాయి. మందుల సరఫరా లేక రోగులు విలవిల్లాడుతున్నారు. బయట కొనుగోలు చేయాల్సి రావడంతో ఆర్థిక భారంతో సతమతమవుతున్నారు.

జిల్లా ఆస్పత్రిలో ఇదీ పరిస్థితి

అనకాపల్లిలో ఉన్న ఎన్టీఆర్ జిల్లా వైద్యాలయానికి జిల్లా నలుమూలల నుంచి రోగులు వస్తుంటారు. రోజుకు ఓపీకి సగటున 500 నుంచి 600 మంది రోగులు వస్తారు. 36 మంది వైద్యులు సేవలందిస్తున్నారు. ప్రభుత్వ, అవుట్‌సోర్సింగ్, కేటగిరిల్లో పనిచేస్తున్న స్టాఫ్ నర్సులు, పారా మెడికల్ సిబ్బంది 510 మంది విధుల్లో ఉంటున్నారు. ఇక్కడ 43 రకాల మాత్రలు, 36 రకాల ఇంజక్షన్లు, 17 రకాల సిరప్‌లు, 12 రకాల ఆయింట్‌మెంట్స్, 4 రకాల డ్రాప్స్ అందుబాటులో ఉండాలి. కానీ వాటిలో 40 శాతం మందులు అందుబాటులో లేవు. మూడు నెలలకొకసారి రూ.18 లక్షల విలువైన మందులకు ఇండెంట్ పెడతారు. వాటిలో 60 శాతమే మందులు వస్తున్నాయి.

- ఈ ఆస్పత్రిలో ప్రధానంగా మెట్రోజిల్-400 ఎంజీ, సిట్రిజన్ హెచ్‌సీఎల్ 10 ఎంజీ, క్లోరో ఫినరమైన్ హెచ్‌సీఎల్, బీ కాంప్లెక్స్, ఐరన్ ఫోలిక్ యాసిడ్, నియోమైసిన్ టాబ్లెట్ల కొరత ఉంది.
- ముప్రోసిన్, సిల్వర్ సల్ఫోడైజిన్, పేరా మెట్రిన్, డైక్లో సోడియం ఆయింట్‌మెంట్లు అందుబాటులో లేవు.
- సిప్రో ఫ్లాక్సిన్, జెంటామైసిన్, జెంటాఫ్లాక్స్ డ్రాప్స్ సరఫరా లేదు.
- సర్జికల్ గ్లాస్ కొరత, పాంటాప్ ఇంజక్షన్ల కొరత ఉంది..
- డెలివరీ సర్జరీలకు, మిగతా ఆపరేషన్ల సమయంలో అవసరమయ్యే కొన్ని మందులు, వైద్య సామగ్రిని రోగులు ప్రైవేట్ దుకాణాల్లో కొని అందించాల్సి వస్తోంది.

ప్రభుత్వాస్పత్రుల్లో వేధిస్తున్న మందుల కొరత

- ఇండెంట్ పూర్తి స్థాయిలో మంజూరు కాని దుస్థితి
- సగం మందులు బయట కొనాల్సిందే..
- 'సాక్షి' క్షేత్ర స్థాయి పరిశీలనలో వెల్లడి

జిల్లాలో ప్రభుత్వాస్పత్రులు

- అనకాపల్లిలో ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రి
- నర్సీపట్నంలో ఏరియా ఆస్పత్రి
- సీహెచ్‌సీలు - 6
- పీహెచ్‌సీలు - 46
- జిల్లాలోని సర్కారు ఆస్పత్రుల్లో రోజుకు సగటున ఓపీల సంఖ్య 3100



ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రిలో మందుల గది వద్ద క్యూలో ఉన్న రోగులు



ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రి జనరల్ వార్డులో చికిత్స పొందుతున్న రోగులు



కోటవురట్ల సీహెచ్‌సీలో ఓపీ విభాగం

రెవెన్యూ సదస్సులకు సిద్ధం కావాలి

- కలెక్టర్ విజయ కృష్ణన్



రెవెన్యూ సదస్సులపై సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: ఈ నెల 6 నుంచి జనవరి 8 వరకు నిర్వహించే రెవెన్యూ సదస్సులకు అధికారులు సిద్ధం కావాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో బుధవారం కలెక్టర్ సమావేశం నిర్వహించారు. గ్రామ సభల్లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి సమగ్ర విచారణ జరిపి, పరిష్కరించాలని ఆమె స్పష్టం చేశారు. కోర్టు కేసులను, ముఖ్యంగా హైకోర్టు కేసులను గుర్తించడానికి ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలన్నారు. వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకోవడానికి బృందం తగిన సూచనలు సలహాలు అందించవచ్చన్నారు. గ్రామసభ సమయంలో పిటిషన్లను నమోదు చేయడానికి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలన్నారు. రెవెన్యూ సదస్సుల సమయంలో కనీసం 2 రోజుల ముందుగా గ్రామాల్లో కరపత్రాలను పంపిణీ చేయాలని, రెవెన్యూ సదస్సులు నిర్వహించే తేదీ, ప్రదేశాన్ని చాటింపు ద్వారా గ్రామస్తులకు తెలియజేయాలన్నారు. జేసీ ఎం.జాహ్నవి, డీఆర్వో దయానిధి, ఆర్డీవోలు వి.వి రమణ, అయిషా తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై నిరంతర పర్యవేక్షణ

ఉపాధి హామీ పథకంలో కేటాయించిన లక్ష్యాలను ఎప్పటికప్పుడు పూర్తిచేయాలని, ఉపాధి పనులపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై డ్వామా, ఎంపీడీవోలు, సంబంధిత శాఖల అధికారులతో బుధవారం కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం 6.30 గంటలకు ఉపాధి హామీ సిబ్బంది, ఏపీవోలు, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో పర్యటించి ఫీల్డ్ అసిస్టెంట్లతో పనిచేయించాలన్నారు. పాయకరావుపేట, నక్కపల్లి మండలాలు ఉపాధి హామీ పనుల పురోగతిలో వెనుకబడి ఉన్నాయని, ఇదే విధంగా కొనసాగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. డ్వామా పీడీ పూర్ణిమ దేవి, జిల్లా పంచాయతీరాజ్ అధికారి శిరీష రాణి, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ నాగలక్ష్మి, పంచాయతీరాజ్ ఎస్ఈ కె.వీరన్ నాయుడు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కార్మికుడి బతుకు బుగ్గిపాలు



సూరిబాబు మృతదేహం

- పొక్లెయిన్ బకెట్ తగిలి లారీ క్లీనర్ దుర్మరణం
- అనకాపల్లి వెంకటశశి స్టోన్ క్రషర్‌లో ప్రమాదం
- నిబంధనలకు విరుద్ధంగా అర్ధరాత్రి పని చేయించుకుంటున్న యాజమాన్యం
- పొక్లెయిన్ డ్రైవర్‌పై కేసు పెట్టిన పోలీసులు
- యాజమాన్యంపై చర్యలుండవా అని ప్రశ్నిస్తున్న కార్మిక సంఘాలు
- స్టోన్ క్రషర్ యజమాని టీడీపీ నేత సుధాకర్ చౌదరి



ప్రమాదం జరిగిన స్టోన్ క్రషర్, (ఇన్‌సెట్) గాలి సూరిబాబు (ఫైల్)

అనకాపల్లి: యాజమాన్యం ధనదాహానికి ఒక కార్మికుడు విగత జీవిగా మారాడు. మరో కార్మికుడు బలిపశువవుతున్నాడు. ప్రమాదం జరిగిన స్టోన్ క్రషర్ యాజమాన్యం మాత్రం ఎలాంటి కేసు లేకుండా ఉంది. అది టీడీపీ నేత గొట్టిపాటి సుధాకర్ చౌదరి క్రషర్ కావడం విమర్శలకు తావిస్తోంది. శ్రీ వెంకటశశి స్టోన్ క్రషర్‌లో మంగళవారం అర్ధరాత్రి ఇసుక లోడ్ చేస్తుండగా పొక్లెయిన్ బకెట్ తగిలి లారీ క్లీనర్ గాలి సూరిబాబు (35) మృతి చెందాడు. అనకాపల్లి మండలం బవులవాడ గ్రామంలో ఉన్న ఈ క్రషర్‌లో రోబో ఇసుక (క్రషర్ బుగ్గి) లోడ్ చేస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. లారీ క్లీనర్ సూరిబాబును ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలోనే మృతి చెందాడు. ఈ మేరకు అనకాపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు, స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం.. శ్రీ వెంకటశశి స్టోన్ క్రషర్‌లో మొత్తం 60 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో కొంతమంది 24 గంటలు పనిచేస్తుండగా, మరికొంతమంది 12 గంటలపాటు పనిచేస్తుంటారు. ఈ క్రషర్‌లో నిబంధనలకు విరుద్ధంగా రాత్రి సమయంలో పొక్లెయిన్‌లతో లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తున్నారు. క్రషర్ బుగ్గి లోడ్ చేసే ముందు సూపర్‌వైజర్ వద్ద నుంచి ఒక స్లిప్‌ను తీసుకుని లారీ లోడ్ చేస్తున్న పొక్లెయిన్ డ్రైవర్‌కు ఇవ్వాల్సి ఉంటుంది. ఆ సమయంలోనే ప్రమాదం జరిగి సూరిబాబు గాయపడి మృతి చెందాడు. పొక్లెయిన్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు. మృతుడు సూరిబాబుకు భార్య జ్యోతి, ఇద్దరు ఆడ పిల్లలున్నారు.

క్రషర్ యాజమానిపై కేసు ఉండదా?

శ్రీ వెంకటశశి స్టోన్ క్రషర్‌లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రాత్రి సమయంలో కార్మికులతో పనులు చేయిస్తున్నారు. నిబంధనలను పాటించకుండా రాత్రి సమయంలో పనులు చేయిస్తున్న శ్రీ వెంకటశశి స్టోన్ క్రషర్ అధినేత గొట్టిపాటి సుధాకర్ చౌదరిపై కేసు ఎందుకు నమోదు చేయలేదంటూ కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి. అధికార టీడీపీ నేతకు చెందిన క్రషర్ కావడంతో పోలీసులు తూతూమంత్రంగా పొక్లెయిన్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి చేతులు దులిపేసుకుంటున్నారని విమర్శిస్తున్నారు. పొక్లెయిన్ డ్రైవర్ కూడా కార్మికుడేనని, స్టోన్ క్రషర్ యాజమాన్యం నిర్లక్ష్యంతో ఒక కార్మికుడు చనిపోతే.. మరో కార్మికుడిపై కేసు నమోదు చేశారే గానీ యాజమాన్యంపై ఎందుకు కేసు పెట్టలేదంటూ కార్మిక సంఘాలు, స్థానిక ప్రజలు మండిపడుతున్నారు.

రోడ్డున పడిన సూరిబాబు కుటుంబం

చోడవరం రూరల్: స్టోన్ క్రషర్ ప్రమాదంలో మరణించిన లారీ క్లీనర్ గాలి సూరిబాబు స్వగ్రామమైన చోడవరం మండలం దుడ్డుపాలెంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఈ ఘటనతో మృతుడి కుటుంబం రోడ్డున పడింది. సూరిబాబు రెక్కల కష్టం పైనే అతని భార్య జ్యోతి, కుమార్తెలు ప్రేమ, మధు ఆధారపడి బతుకుతున్నారు.

మంగళవారం రాత్రి పనికి వెళ్లిన తన భర్త ఇంటికి వస్తాడని ఎదురుచూస్తున్న జ్యోతి.. అతనిని మృత్యువు కబళించిందని తెలుసుకొని గుండెలవిసేలా రోదిస్తోంది. దీనంగా చూస్తున్న తొమ్మిదేళ్ల ప్రేమ, ఆరేళ్ల మధులను చూసి అందరూ కంట తడి పెట్టుకున్నారు. మృతుడు సూరిబాబుకు వేరే ఆధారం లేదని, క్లీనర్‌గా పనిచేస్తూ తన కుటుంబంతోపాటు ముగ్గురు సోదరులను పోషిస్తున్నాడని, అతని దుర్మరణం ఆ కుటుంబాన్ని కోలుకోలేని దెబ్బతీసిందని గ్రామ సర్పంచ్ జి.వి. సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు.

కనుల పండువగా శ్రీరామపాదుకా పట్టాభిషేకం





పూజలో పాల్గొన్న దంపతులు (ఇన్‌సెట్) శ్రీరామపాదుకలు



శ్రీరామపాదుకా పట్టాభిషేకంలో పాల్గొన్న చినజీయర్‌స్వామి

అనకాపల్లి: స్థానిక కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రతిష్ఠ జరిగి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన శ్రీరామపాదుకా పట్టాభిషేకం బుధవారం సాయంత్రం నేత్రపర్వంగా జరిగింది. శ్రీ త్రిదండి రామానుజ చినజీయర్ స్వామి హాజరై భక్తులను అనుగ్రహించారు. వికాస తరంగిణి అనకాపల్లి శాఖ ఆధ్వర్యంలో శారదానది ఒడ్డు నుంచి తహసీల్దార్ కార్యాలయం మీదుగా నెహ్రూచౌక్, వేల్పులవీధి జంక్షన్ మీదుగా మెయిన్‌రోడ్డులో కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించి చినజీయర్‌స్వామిని తోడ్కొని వచ్చారు. స్వామి అక్కడ కన్యకాపరమేశ్వరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరామపాదుకా పట్టాభిషేకాన్ని పురస్కరించుకుని ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, పట్టాభిషేకం చేపట్టారు. ఉత్సవ కమిటీ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో చైర్మన్ గ్రంధి శేషుకుమార్, ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టులతో గంజాయి రవాణాకు అడ్డుకట్ట



దేవరాపల్లి పోలీస్‌స్టేషన్‌లో తనిఖీ చేస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

- సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి
- బెల్టు షాపులు తెరిస్తే కఠిన చర్యలు
- ఇసుక అక్రమ రవాణా చేస్తే కేసులు నమోదు
- ఎస్పీ తుహిన్ సిన్హా హెచ్చరిక
- దేవరాపల్లి పోలీస్‌స్టేషన్ సందర్శన

దేవరాపల్లి: జిల్లాలో గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్టు వేసేందుకు ఏర్పాటు చేసిన ఐదు చెక్‌పోస్టులతో సత్ఫలితాలు వస్తున్నాయని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. ఈ చెక్ పోస్టులలో వైఫైను అనుసంధానించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు ఎస్ఐ, సీఐ, డీఎస్పీ, ఏఎస్పీ, ఎస్పీ స్థాయిలో సైతం నిత్యం పర్యవేక్షణ ఉంటుందన్నారు. పటిష్ట నిఘా పెట్టడంతో అనకాపల్లి జిల్లాలో గంజాయి అక్రమ రవాణా తగ్గుముఖం పట్టిందన్నారు. గత నెలలోనే జిల్లా వ్యాప్తంగా 55 కేసులు నమోదు చేశామన్నారు. ఈ మేరకు దేవరాపల్లి పోలీస్‌స్టేషన్‌ను వార్షిక తనిఖీలలో భాగంగా బుధవారం సాయంత్రం సందర్శించారు. స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించి, పెండింగ్ కేసులపై ఆరా తీశారు. డీఎస్పీ ఎం.శ్రావణి, సీఐ పి. పైడపునాయుడు, స్థానిక ఎస్ఐ టి. మల్లేశ్వరరావుతో మండలంలో శాంతి భద్రతల పరిస్థితిలపై సమీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రజలకు, విద్యార్థులకు సోషల్ మీడియా, పోస్టర్ల ప్రదర్శన ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. సైబర్ మోసాల బారినపడితే తక్షణమే 1930 హెల్ప్ లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని అన్నారు. డిజిటల్ అరెస్టుల పేరిట కొత్త రకం మోసాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనకాపల్లి జిల్లాలో బెల్టు షాపులు నిర్వహిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని అన్నారు. బెల్టు షాపులు నిర్వహిస్తే 112 హెల్ప్ లైన్ లేదా స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అన్ని రికార్డులు సక్రమంగా ఉంటే సాయంత్రం 6 లోపు మాత్రమే ఇసుక తరలించాలని, నిబంధనలను ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

40 లీటర్ల నాటుసారాతో ఒకరు అరెస్టు



నాటుసారాతో పట్టుబడ్డ మహిళతో ఎక్సైజ్ సిబ్బంది

చోడవరం రూరల్ : పట్టణ పరిధిలోని ఐటీఐ కాలనీలో నాటుసారాతో మహిళ పట్టుబడగా అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐ కె.వి. పాపునాయుడు తెలిపారు. బుధవారం ఎక్సైజ్ ఎస్ఐ ఎం.శేఖరం సిబ్బందితో కలసి ఐటీఐ పరిసర ప్రాంతాల్లో పెట్రోలింగ్ చేస్తుండగా అదే కాలనీకి చెందిన జలగడుగుల దుర్గ వద్ద ప్లాస్టిక్ క్యానులో 40 లీటర్ల నాటుసారా పట్టుబడిందని చెప్పారు. సారాను స్వాధీనం చేసుకుని మహిళను అరెస్టు చేసిన అనంతరం స్థానిక ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్టు తెలిపారు. దాడుల్లో ఎస్ఐ శేఖరంతో పాటు సిబ్బంది రాధా, అప్పలనాయుడు, భీమ, రాముడునాయుడు పాల్గొన్నట్టు సీఐ తెలిపారు.

సాంకేతికత.. సృజనాత్మకత

మారుతున్న సాంకేతిక వ్యవస్థలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ మారాల్సిందే. విద్యార్థి దశ నుంచే సాంకేతిక భావనలను పెంపొందించుకోవాల్సిందే.. లేదంటే వెనుకబడిపోతారు. అందుకే విద్యార్థులకు నేటి సాంకేతిక మార్పులపై అవగాహన పెంపొందించి.. రానున్న తరాన్ని మరింత ఇన్నోవేటివ్‌గా తయారు చేయాలనే ఉద్దేశంతో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో బుధవారం 'విశాఖ రీజినల్ పాలిటెక్ ఫెస్ట్'ను ఏర్పాటు చేశారు. ఈ ఫెస్ట్‌లో విద్యార్థులు తమ సృజనాత్మక ఆలోచనలకు పదును పెట్టి.. నూతన ఆవిష్కరణలను సృష్టించి వాటి నమూనాలను ప్రదర్శించారు జీవితంలోని ప్రతి మలుపును సాంకేతికతతో అనుసంధానిస్తూ వారు రూపొందించిన నమూనాలు సందర్శకులను ఆలోచింపజేశాయి. – మురళీనగర్ (విశాఖ)

పరిశ్రమల్లో గ్యాస్ లీకేజీని పసిగట్టేస్తుంది



పరిశ్రమల్లో ప్రమాదకర వాయువుల లీకేజీని పసిగట్టే డ్రోన్

కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు రూపొందించిన డ్రోన్ టెక్నాలజీ ద్వారా పరిశ్రమల్లో విషవాయువుల లీకేజీలను ముందే గుర్తించి ప్రమాదాలను నివారించవచ్చు. రియల్ టైమ్ పర్యవేక్షణ ద్వారా సమాచారాన్ని సేకరించి, విష పూరిత గ్యాస్ లీక్ అయినప్పుడు దాని గాఢతను తగ్గించడానికి పేలోడ్‌ను వినియోగిస్తారు. దీని వల్ల ప్రాణనష్టాన్ని నివారించవచ్చు. ఈ డ్రోన్‌ను అగ్నిమాపక, వ్యవసాయం, జీపీఎస్, ఉష్ణోగ్రత కొలతలు వంటి రంగాల్లో వినియోగించవచ్చు. డాక్టర్ బి.వి. లక్ష్మణరావు మార్గదర్శకత్వంలో పి.భవానీశంకర్, ఆర్.పైడిరాజు, ఎస్.కె.అబ్దుల్ రజాక్, టి.ప్రనూష్ రూ.25 వేలు ఖర్చు చేసి ఈ పరికరాన్ని రూపొందించారు.

సరకుల షిఫ్టింగ్‌లో నష్ట నివారణ



ప్రోటోటైప్ కన్వేయర్ బెల్ట్

కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ ఎలక్ట్రికల్ విభాగం విద్యార్థులు కన్వేయర్ బెల్ట్ ద్వారా భారీ వస్తువుల షిఫ్టింగ్‌ను సులభతరం చేసి, ప్రమాదాలను నివారించేందుకు ఒక నూతన విధానాన్ని ఆవిష్కరించారు. ఇందుకోసం ప్రోటోటైప్ కన్వేయర్ బెల్ట్‌లో వీఎఫ్‌డీ (వేరియబుల్ ఫ్రీక్వెన్సీ డ్రైవ్), పీఎల్‌సీ (ప్రోగ్రామబుల్ లాజిక్ కంట్రోలర్), సేఫ్టీ లైట్ కర్టెన్‌లను ఉపయోగించారు. దీని ద్వారా లోడింగ్ సమయంలో బెల్ట్‌కు ఏర్పడే అడ్డంకులను ముందే గుర్తించవచ్చు. బెల్ట్ అనుకోకుండా తెగిపడితే వీఎఫ్‌డీని ఉపయోగించి దాన్ని నియంత్రించవచ్చు. ఈ విధానం ద్వారా 2వేల పారామీటర్ల వరకు కంట్రోల్ చేసి ప్రమాదాలను నివారించవచ్చు. కె.వి.సుబ్రమణ్యేశ్వర రావు మార్గదర్శకత్వంలో కె.నాగదుర్గ, కె.అభిరామ్, కె.ఎస్.కె.ఎస్ యోషిక్, కె.మోహన్ ప్రీస్‌లు రూ.50వేల ఖర్చుతో ఈ ప్రాజెక్ట్‌ను రూపొందించారు.

స్మార్ట్ సిటీకి క్లీన్ ఎనర్జీ



స్మార్ట్ సిటీ ప్రాజెక్టు

స్మార్ట్ సిటీగా రూపొందించే ప్రయత్నంలో భాగంగా క్లీన్ ఎనర్జీ ఉత్పత్తి, సరఫరాకు సంబంధించి సాయిగణపతి పాలిటెక్నిక్ విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు ఆసక్తి కలిగించింది. డి. కిశోర్‌కుమార్ మార్గదర్శకత్వంలో జి.దివ్య, జె.ప్రియాంక, సీహెచ్.అనూషారెడ్డి, కె.జయజ్యోతి ఈ ప్రాజెక్టును రూ.3 వేలతో రూపొందించారు. స్వచ్ఛ నగర నిర్మాణంలో భాగంగా సేకరించే చెత్తను వివిధ రకాలుగా ఉపయోగించుకోవచ్చని విద్యార్థులు చెబుతున్నారు. ముఖ్యంగా పునర్వినియోగపరచలేని ఘన వ్యర్థాల నుంచి బయోగ్యాస్, విద్యుత్, నూనెను ఉత్పత్తి చేయవచ్చని తెలియజేస్తున్నారు.

హెల్మెట్ ధరిస్తేనే బండి స్టార్ట్



స్మార్ట్ హెల్మెట్ ప్రాజెక్టు.

భీమిలి మహిళా పాలిటెక్నిక్ కాలేజీ నుంచి షబ్నం పర్వీన్ మార్గదర్శకత్వంలో బి.మేరియా అక్షిత, సీహెచ్ మాధురి, జీఎస్ శిరిలక్ష్మి కేవలం రూ. 3,500తో ఒక స్మార్ట్ హెల్మెట్‌ను రూపొందించారు. ఈ హెల్మెట్‌ను ధరించకపోతే వాహనం ఇంజిన్ స్టార్ట్ అవ్వదు. అంతేకాకుండా, ఈ విషయం వారి కుటుంబ సభ్యుల ఫోన్‌కు మెసేజ్ రూపంలో వెళుతుంది. అలాగే చోదకుడు ఆల్కహాల్ సేవించి బండి నడిపితే ఆల్కహాల్ సెన్సార్ నుంచి నేరుగా ఇంట్లో మొబైల్‌కు సమాచారం వెళుతుంది. పరిమితికి మించి వేగం పెంచినా తెలిసిపోతుంది. ఇందుకోసం వీరు జీపీఎస్ మాడ్యూల్, జీఎస్ఎం మాడ్యూల్, ఎంక్యూ 3 ఆల్కహాల్ సెన్సార్, ఆర్ఎఫ్ ట్రాన్స్ మీటర్, రిసీవర్‌ను వాడారు.

కొత్త బోన్ సృష్టిస్తాం

మన శరీరంలోని అసలు ఎముకల మాదిరిగానే కొత్త ఎముకలను తయారు చేసి, వాటిని శరీరంతో అనుసంధాస్తామని చెబుతున్నారు కంచరపాలెం మెటలర్జీ విద్యార్థులు. హైడ్రాక్సీ ఎపటైట్(హెచ్‌వోపీ) ద్వారా ఈ విధానం సాధ్యమవుతుందని అంటున్నారు. ఈ పరిశోధన కోసం వారు రూ.25,000 ఖర్చు చేసిన ఒక ప్రింటింగ్ మెషీన్‌ను రూపొందించారు. పి.అక్షయ, బి.గాయత్రి, జె. ఆదర్శరెడ్డి, ఎన్.అభిషేక్‌లు ఈ మెషీన్‌ను రూపొందించగా, పి.రాజేంద్రబాబు వారికి మార్గదర్శకత్వం వహించారు. తొలగించిన ఎముక స్థానంలో హెచ్‌వోపీతో తయారు చేసిన కొత్త ఎముకను అమర్చడం ద్వారా, జీవితాంతం కొనసాగే ఒక పరిష్కారాన్ని అందించవచ్చని విద్యార్థులు తెలిపారు.



బయో ఇన్‌స్ప్లాంట్ బోన్ ప్రింటింగ్ మెషీన్

వైశ్యరాజు జ్యూవెల్లరీ షోరూం ప్రారంభం



తునిలో షోరూంను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుధారాణి

తుని: స్థానిక బాలాజీ కాంప్లెక్స్ ఎదురుగా ఏర్పాటు చేసిన వైశ్యరాజు జ్యూవెల్లరీ షోరూంను బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి ప్రారంభించారు. ఆమె జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం పట్టణ ప్రముఖ వ్యాపారవేత్త చెక్కా సూర్యనారాయణ మొదటి కొనుగోలు చేశారు. అనంతరం షోరూంలోని ఆభరణాలను మున్సిపల్ చైర్‌పర్సన్ తిలకించారు. ఈ సందర్భంగా షోరూం మేనేజింగ్ డైరెక్టర్ వైశ్యరాజు భద్రగిరిరాజు మాట్లాడుతూ ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో మొట్టమొదటిగా తునిలో షోరూం ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రారంభోత్సవ ఆఫర్‌గా అన్ని రకాల బంగారు ఆభరణాలను ప్లాట్ ఆరుశాతం తరుగుకే పొందవచ్చన్నారు. సాధారణ వెండి వస్తువులపై తరుగు లేదన్నారు. కార్యక్రమంలో చైర్మన్ వైశ్యరాజు ఫల్గుణరాజు, సంస్థ డైరెక్టర్లు వైశ్యరాజు నరేష్, వైశ్యరాజు కిరణ్‌కుమార్‌రాజు, చెక్కా రమేష్, గోగుల కోటేశ్వరరావు, కోలా ఈశ్వరరావు పాల్గొన్నారు.

కలరింగ్, హ్యాండ్‌రైటింగ్ పోటీలో జెడ్పీ విద్యార్థుల ప్రతిభ



విజేత హర్షిణికి గోల్డ్ మెడల్ అందజేస్తున్న హెచ్‌ఎం ప్రసాదరావు



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో డ్రాయింగ్ టీచర్ అరుణ్ కుమార్

రోలుగుంట : ఆలిండియా కలరింగు, హ్యాండ్ రైటింగ్ పోటీల్లో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపారు. రెండు బంగారు పతకాలు, ఒక వెండి పతకం కైవసం చేసుకున్నారు. విజేతలను, వారికి శిక్షణ ఇచ్చిన డ్రాయింగ్ టీచర్ ఆరుణ్ కుమార్‌ను బుధవారం హెచ్‌ఎం ప్రసాద్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి రైన్‌బో ఆర్ట్ సెంటర్, భావ్ నగర్, గుజరాత్ వారు నిర్వహించిన ఆలిండియా కలరింగ్, హ్యాండ్ రైటింగ్ పోటీలకు 25 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో ముగ్గురు విద్యార్థులు కె.హర్షిణి, బి.శ్యామల బంగారు పతకాలు, పి.గాయత్రి రజత పతకం సాధించారు. గత నెలలో జరిగిన ఈ పోటీల్లో పాల్గొన్న వారికి ప్రశంసాపత్రాలు, విజేతలకు పతకాలు మంగళవారం జెడ్పీ ఉన్నత పాఠశాలకు రావడంతో వాటిని బుధవారం హెచ్‌ఎం పాఠశాల అవరణలో అందజేసి అభినందించారు. కార్యక్రమంలో సైన్సు టీచర్ నానీ, ఇంగ్లిష్ టీచర్ నాగజ్యోతి, సోషల్ టీచర్ శర్మ, కిరణ్, సతీష్ ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

బొట్టు పెట్టి చెబుతున్నాం..తప్పక రండి



వెలంకాయలపాలెంలో సమావేశానికి బొట్టు పెట్టి ఆహ్వానిస్తున్న ఎస్‌ఎంసీ చైర్మన్

- పీఎంసీ సమావేశానికి వినూత్నంగా ఆహ్వానం

రోలుగుంట : కండపాలెం పంచాయతీ శివారు వెలంకాయలపాలెం ఎంపీపీ పాఠశాల పేరెంట్స్ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులందరినీ హాజరుపరచాలని హెచ్‌ఎం బండారు సూర్యనారాయణ సహచర ఉపాధ్యాయుడు బి.చంద్రశేఖర్‌తో కలసి నిర్ణయించారు. ఈ మేరకు ఎస్ఎంసీ చైర్మన్‌తో కలిసి విద్యార్థుల తల్లిదండ్రుల ఇళ్లకు వెళ్లి బొట్టు పెట్టి వినూత్నంగా ఆహ్వానిస్తున్నారు.

దీనిపై విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి కూడా కూడా మంచి స్పందన వస్తుంది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులిరువురూ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు వెళ్లకుండా ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు పెంచే కార్యక్రమాలను చేపట్టామన్నారు. తమ ప్రయత్నాలకు విద్యార్థుల తల్లిదండ్రులు సహకరిస్తున్నారన్నారు. పాఠశాల అభివృద్ధికి ఈ విధమైన చర్యలు కొంతమేర మంచి ఫలితాలకు దోహదపడతాయిని ఆశాభావం వ్యక్తం చేశారు. గతేడాదికన్నా ఈ ఏడాది విద్యార్థుల రోల్ పెరిగిందని, ఎంతో ఆనందంగా ఉందన్నారు.

వ్యాన్ ఢీకొని వృద్ధుడి మృతి



మృతుడు చంటి (ఫైల్)

నక్కపల్లి : జాతీయ రహదారిపై ఒడ్డిమెట్ట సమీపంలో వ్యాన్ ఢీకొనడంతో వృద్ధుడు దుర్మరణం చెందాడు. చినదొడ్డిగల్లుకు చెందిన పిరుమాల చంటి(75) తాపీ మేస్త్రిగా పనిచేస్తున్నాడు. బుధవారం తుని భవన నిర్మాణ పనులకు వెళ్లి మోటారు సైకిల్‌పై తిరిగి ఇంటికి వస్తుండగా ఒడ్డిమెట్ట సమీపంలో వ్యాన్ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో చంటి రోడ్డుపై పడిపోయాడు. తలకు బలమైన గాయం తగిలి తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సన్నిబాబు తెలిపారు.

రేపటి నుంచి ప్రజా రవాణా వ్యవస్థ జాతీయ క్రీడా పోటీలు

డాబాగార్డెన్స్: ప్రజా రవాణా వ్యవస్థ ఉద్యోగుల క్రీడా సంబరాలకు విశాఖ సిద్ధమవుతోంది. అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండర్ టేకింగ్ ఆధ్వర్యంలో కైలాసగిరి పోలీస్ క్రీడా ప్రాంగణం వేదికగా ఈ నెల 6 నుంచి మూడు రోజుల పాటు జాతీయ స్థాయి పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలను సజావుగా నిర్వహించేందుకు ఏపీఎస్ఆర్టీసీ జోన్-1 ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయ్ కుమార్ నేతృత్వంలో రెండు సార్లు ఆర్టీసీ ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. క్రీడాకారులకు స్వాగతం, రవాణా, వసతి, ఆహార పంపిణీ, క్రీడా ప్రాంగణం, మెడికల్, సెక్యూరిటీ తదితర ఏర్పాట్లపై పలు కమిటీలతో సమీక్షించి, పలు ఆదేశాలు జారీ చేశారు.

పలు ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: పండగల వేళ ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు ప్రత్యేక రైళ్ల నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. విశాఖపట్నం-చెన్నై ఎగ్మోర్(08557/08558), విశాఖపట్నం-షాలిమర్ (08508/08507), సంబల్‌పూర్-ఈరోడ్(08311/08312), భువనేశ్వర్-యశ్వంత్‌పూర్(02811/02812) వీక్లీ ఏసీ స్పెషల్ నడుపుతున్నట్లు పేర్కొన్నారు.

ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో అమరావతి ఎక్స్‌ప్రెస్

షాలిమర్-వాస్కోడగమా-షాలిమర్ అమరావతి ఎక్స్‌ప్రెస్‌ను ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో నడపనున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. షాలిమర్-వాస్కోడగామా(18047) అమరావతి ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 16 నుంచి, వాస్కోడగామా-షాలిమర్(18048) అమరావతి ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 19 నుంచి ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఆయా తేదీల నుంచి ఈ రైలు సెకండ్ ఏసీ-1. థర్డ్ ఏసీ-4, స్లీపర్ క్లాస్-9, జనరల్ సెకండ్ క్లాస్ -4. సెకండ్ క్లాస్ కం లగేజి/దివ్యాంగ, జనరేటర్ మోటార్‌కార్ కోచ్‌లతో నడుస్తుంది.

బీటెక్ పరీక్ష వాయిదా

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈ నెల 7న జరగాల్సిన బీటెక్ ఫస్ట్ సెమిస్టర్ పరీక్షను వాయిదా వేస్తున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ టి.చిట్టిబాబు తెలిపారు. ఆ రోజు పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఉన్నందున విద్యార్థుల సౌకర్యార్థం ఈ వెసులుబాటు కల్పించామన్నారు. వాయిదా వేసిన పరీక్షను ఈ నెల 16న మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

100 కేజీల గంజాయి పట్టివేత

- విలువ సుమారు రూ.10 లక్షలు
- ముగ్గురు అరెస్టు, మరొకరు పరార్



విలేకరులకు వివరాలు తెలుపుతున్న డీఎస్పీ శ్రావణి

అనకాపల్లి : మండలంలోని ఊడేరు గ్రామం వద్ద మంగళవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా పాడేరు నుంచి అనకాపల్లి వస్తున్న కారులో 100 కేజీల గంజాయితో నలుగురు వ్యక్తులు ప్రయాణిస్తూ పోలీసులను చూసి పరారవడానికి ప్రయత్నించారు. ఒకరు తప్పించుకోగా మిగిలిన ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు డీఎస్పీ ఎం.శ్రావణి బుధవారం విలేకరులకు తెలిపారు. పట్టుబడ్డ గంజాయి విలువ సుమారు రూ.10 లక్షలు ఉంటుందన్నారు. కారులో 5 గోనె సంచుల్లో 50 ప్యాకెట్లలో గంజాయి నింపారని, ఒక్కో ప్యాకెట్ సుమారుగా 2 కేజీలు చొప్పున మొత్తం 100 కేజీలు గంజాయి ఉన్నట్టు గుర్తించామన్నారు. జిల్లాలో వి.మాడుగుల మండలం వీరవిల్లి అగ్రహారం గ్రామానికి చెందిన సుంకర మహేష్ కుమార్, తాటికొండ రాకేష్, అల్లూరి జిల్లా జి.మాడుగుల మండలం వి.కోడపల్లి గ్రామానికి చెందిన ఉల్లి కొండబాబులపై కేసు నమోదు చేయగా, మరో వ్యక్తి పరారైనట్టు తెలిపారు. గంజాయి తరలిస్తున్న నలుగురు వ్యక్తులు పాత నేరస్తులేనన్నారు. ఈ గంజాయిని ఒడిశా నుంచి అల్లూరి జిల్లా జి.మాడుగుల మీదుగా అనకాపల్లి నుంచి విశాఖకు తరలించేందుకు ఉల్లి కొండబాబు పథకం పన్నినట్టు చెప్పారు. కారు డ్రైవర్ తాటికొండ రాకేష్ చోడవరం, అనకాపల్లి మీదుగా, విశాఖ వెళ్లేందుకు చెకింగ్ తక్కువగా ఉంటుందని వాహనాన్ని తీసుకు వస్తున్నట్టు తెలిపారు. పరారైన నిందితుడి కోసం రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నిందితుల నుంచి కారు, 100 కేజీల గంజాయి, రూ.850 నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో రూరల్ సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ రవికుమార్ పాల్గొన్నారు.

తల్లిదండ్రుల సూచనలతో స్కూళ్ల అభివృద్ధికి బాటలు

- డీఈవో జి.అప్పారావునాయుడు



కశింకోట బాలికల హైస్కూల్లో మొక్కలు నాటుతున్న డీఈవో

కశింకోట : పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రులు, దాతలు, పూర్వ విద్యార్థులను భాగస్వాములు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి జి.అప్పారావునాయుడు కోరారు. నియోజకవర్గంలోని స్కూళ్లలో నిర్వహించే మెగా పేరెంట్స్ సమావేశాల్లో మంత్రి నారా లోకేష్ ఈనెల 7న పాల్గొంటారన్న సమాచారం నేపథ్యంలో కశింకోటలోని బాలికల హైస్కూలు, డీపీఎన్ జెడ్పీ హైస్కూలు, తాళ్లపాలెం హైస్కూళ్లను బుధవారం సందర్శించారు. అక్కడి ఉపాధ్యాయులు, అధికారులతో సమావేశమై మెగా పేరెంట్స్ సమావేశ ఏర్పాట్లపై దిశా నిర్దేశం చేశారు. పేరెంట్స్ సమావేశంలో తల్లిదండ్రులు, విద్యార్థులను కలిపి సమావేశాలను నిర్వహించి విద్యార్థుల విజయాలను ఉపాధ్యాయులు తెలియజేయాల్సి ఉంటుందన్నారు. దివ్యాంగ విద్యార్థుల ప్రతిభా పాటవాలు కూడా ప్రత్యేకంగా తెలిపి వారి సంక్షేమానికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల గురించి తెలియజేయాలన్నారు. తల్లిదండ్రులు, దాతలు, పూర్వ విద్యార్థుల నుంచి పాఠశాలల అభివృద్ధి సలహాలు, సూచనలు స్వీకరించాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు, ప్రత్యేక హెల్త్ కార్డులను ఇవ్వడానికి సిద్ధం చేయాలన్నారు. ఆ రోజు సమావేశం అనంతరం తల్లిదండ్రులు, విద్యార్థులకు సహ పంక్తి భోజనాలు ఏర్పాటు చేయాలన్నారు. భోజనం నాణ్యత పెంపునకు తల్లిదండ్రుల నుంచి సలహాలు స్వీకరించాలన్నారు. ఈ సందర్భంగా బాలికల పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఎంఈవోలు వెంకట సురేష్, వీఎస్ఎన్ మూర్తి, హెచ్‌ఎంలు ఎంఎస్ స్వర్ణకుమారి, విజయలక్ష్మి సుమన్, ఆచంట రవి, ఉపాధ్యాయులు సమావేశంలో పాల్గొన్నారు.

ఎరువులు, పురుగు మందులకు రశీదులు తప్పనిసరి

- యలమంచిలి ఏడీఏ ప్రభాకర్
- దేవరాపల్లిలో దుకాణాల తనిఖీ



దేవరాపల్లిలో మన గ్రోమోర్ షాపును తనిఖీ చేస్తున్న ఏడీఏ బి. ప్రభాకర్

దేవరాపల్లి : ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసే ప్రతి రైతుకు రశీదులు తప్పనిసరిగా ఇవ్వాలని యలమంచిలి ఏడీఏ బి.ప్రభాకర్ ఆదేశించారు. దేవరాపల్లిలో మన గ్రోమోర్ షాపు, హేమ రైతు డిపోలలో ఎరువులు, పురుగు మందులను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. షాపులోని పురుగు మందుల బాటిల్స్ కాలపరిమితిని పరిశీలించారు. అధిక ధరలకు విక్రయించే షాపు యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక జారీ చేశారు. ఈయన వెంట మండల వ్యవసాయ అధికారి వై. కాంతమ్మ, మండల వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు ఆపాలి

బీచ్ రోడ్డులో హిందూ సంఘాల ర్యాలీ



బీచ్ రోడ్డు ర్యాలీ చేస్తున్న హిందూ సంఘాల సభ్యులు, నగర వాసులు

ఏయూక్యాంపస్: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను తక్షణం ఆపాలని కోరుతూ హిందూ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ర్యాలీ నిర్వహించారు. ఆర్‌కే బీచ్ నుంచి విక్టరీ ఎట్ సీ వరకు నగర వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని నినాదాలు చేశారు. ప్రపంచ హిందువులంతా ఏకం కావాలని, ఇస్కాన్ స్వామీజీ చిన్మయ దాస్‌ను వెంటనే విడుదల చేయాలని నినదించారు. సమానత్వం, న్యాయం కోసం స్వామి చిన్మయదాస్ పోరాటం మహోన్నతమన్నారు. మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్ మాట్లాడుతూ బంగ్లాదేశ్ ప్రభుత్వం హిందువులకు రక్షణ కల్పించకపోగా, చిన్మయదాస్ వంటి వారిని అరెస్టు చేయడం శోచనీయమన్నారు. దీనిపై మేధావులు, సెలబ్రిటీలు, మానవ హక్కుల కార్యకర్తలు వెంటనే స్పందించాలని కోరారు. ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు జరగకుండా కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్ఎస్ఎస్ ప్రాంత సహ ప్రచారక్ జనార్దన్ మాట్లాడుతూ మానవ హక్కులను హరించేలా బంగ్లాదేశ్‌లో పరిస్థితులు ఉన్నాయన్నారు. చిన్మయ దాస్‌ని భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. భారత్ మాతాకీ జై నినాదాలతో బీచ్ రోడ్డు హోరెత్తింది.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా బంద్

అనకాపల్లి: స్థానిక విద్యుత్‌శాఖ డి–1 సెక్షన్ పరిధిలో మరమ్మతులు, జంగిల్ క్లియరెన్స్ పనుల నిమిత్తం గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆశాఖ ఈఈ కె.రాజశేఖర్, ఏఈ త్రినాథ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. డి–1 సెక్షన్ పరిధిలో మళ్లవీధి, శేఖవీధి, నెయ్యిలవీధి, ఉడ్‌పేట, వేల్పులవీధి, నర్సింగరావుపేట, దుర్గాలాడ్జి వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని, స్థానికులు సహకరించాలని కోరారు.

6న గవరపాలెం పరిధిలో..

స్థానిక గవరపాలెం విద్యుత్‌శాఖ డి–2 సెక్షన్ పరిధిలో జంగిల్ క్లియరెన్స్ నిమిత్తం ఈనెల 6వ తేదీ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆశాఖ ఈఈ కె.రాజశేఖర్, డి–2 ఏఈ జి.వై.రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డి–2 సెక్షన్ పరిధిలో గవరపాలెం చిన్న,పెద్దరామస్వామి ఆలయ రహదారి, కర్రివారివీధి, ఎన్టీఆర్ కాలనీ, వల్లపువీధి బంగ్లా, దాసరిగెడ్డ రోడ్డు, సాయి బృందావన నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వినూత్నంగా గణిత భావనల ప్రదర్శన



వెదురుపర్తి హైస్కూలులో విద్యార్థులు నేలపై రంగులతో వేసిన గణిత భావనలు

కశింకోట: మండలంలోని వెదురుపర్తి హైస్కూలులో రంగులతో వివిధ గణిత భావనలను వినూత్నంగా నేలపై వేసి వాటి ప్రాధాన్యతను గురించి వివరించారు. జాతీయ గణిత మాసోత్సవాల్లో భాగంగా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం జి.వి.కె. ఆచారి మాట్లాడుతూ విద్యార్థులు వినూత్నంగా నేర్చుకుంటున్న గణిత భావనలు జీవితాంతం గుర్తుండటానికి అవకాశం కలుగుతుందన్నారు. గణిత భావనలు చక్కగా వివరించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గణిత ఉపాధ్యాయులు ఎ.వి.ఎన్.మూర్తి, పి.వి.ఎస్.ఎన్.మూర్తి, ఫిజికల్ డైరెక్టర్ ఎ. నూకరాజు, ఉపాధ్యాయుడు బోయిన చిన్నారావు, సబిత లక్ష్మి, ఎ. సోమరాజు, త్రివేణి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 1,673 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,760	4,450
మొదటి రకం	3,430	4,200
రెండో రకం	2,950	3,850
మూడోరకం	2,740	3,070

అనకాపల్లి సినిమాలు

పుష్ప–2	: రాజా
పుష్ప–2	: సత్యనారాయణ స్క్రీన్–1
పుష్ప–2	: సత్యనారాయణ స్క్రీన్–2
పుష్ప–2	: పర్తిసాయి
పుష్ప–2	: షిర్డీసాయి
పుష్ప–2	: వెంకటేశ్వర
సినిమా పిచ్చోడు	: శ్రీసత్య
పుష్ప–2	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 27 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్–7 యూనిట్లు, బి పాజిటివ్–9 యూనిట్లు, ఒ పాజిటివ్–10 యూనిట్లు, ఏబీ పాజిటివ్–1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ య.లోకేష్ (ఫోన్ నంబర్ 9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 395 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 361 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి(ఫోన్ నంబర్ 08924–223595 నంబరు)ని సంప్రదించవచ్చు.

కూరగాయల సాగు.. లాభాలు బాగు

- కశింకోట మండలంలో 150 ఎకరాల్లో సాగు
- ఎకరాకు రూ.30 వేల లాభం



జి.భీమవరంలో వంగ సాగు



చిక్కుడు పాదు

కశింకోట: మండలంలో పలువురు రైతులు కూరగాయల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. లాభాలు ఆశాజనకంగా ఉండడంతో దీనిపై శ్రద్ధ చూపుతున్నారు. వాటిని విశాఖనగరంలో రైతు బజార్లకు తరలించి విక్రయిస్తూ మంచి ఆదాయం పొందుతున్నారు. మండలంలో ప్రధానంగా జి.భీమవరం, ఆనందపురం, లాలంకొత్తూరు, కన్నూరుపాలెం, పాత కన్నూరుపాలెం, చెరకాం, తీడ, అచ్చెర్ల, సింగవరం, విసన్నపేట, రామన్నపాలెం, జమాదులపాలెం, బయ్యవరం,కశింకోట తదితర గ్రామాల్లో ఎక్కువగా కూరగాయలు సాగు చేస్తున్నారు. టమాటా, బీర, బెండ, చిక్కుడు, ఆనప, బరబాటి, వంగ, కాకర, పొట్ల తదితర పంటలను సుమారు 150 ఎకరాల్లో పండిస్తున్నారు. కూరగాయలు సాగు చేసే వారిలో అత్యధిక మంది సన్న, చిన్నకారు రైతులే. ఎకరాకు రూ.20 వేల పైగా పెట్టుబడి అవుతుంది. బాగా పండితే రూ.50 వేల వరకు ఆదాయం వస్తుంది. ఇక్కడ పండించిన కూరగాయలను స్థానికంగా, అనకాపల్లి, తాళ్లపాలెం, కన్నూరుపాలెం ప్రాంతాల్లో నిర్వహించే వారపు సంతలతోపాటు విశాఖలోని వేర్వేరు చోట్ల ఉన్న రైతు బజార్లకు తరలించి విక్రయిస్తున్నారు. సుమారు 60 మంది రైతులు కూరగాయలను రైతు బజార్లకు తీసుకెళుతున్నారు. వీటిని విశాఖ తరలించడానికి అనువుగా ఆర్టీసీ తీడ మీదుగా తోటకూరపాలెం వరకు బస్సు రోజూ నడుపుతోంది.

కూలీలు దొరక్క అవస్థలు

కూరగాయల పంటలపై తెగుళ్లు రావడం,పెట్టుబడి ఎక్కువ కావడం, కూలీలు సరిగ్గా దొరకకపోవడంతో వీటి సాగు భారంగా మారుతోంది.దీంతో కొందరు సాగు చేయడానికి ఆసక్తి చూపడం లేదు. గతంలో 180 ఎకరాల్లో కూరగాయలు పండించే వారు. ప్రస్తుతం సుమారు 150 ఎకరాల్లో పండిస్తున్నారు. కూరగాయల సాగుకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందివ్వాలని రైతులు కోరుతున్నారు.

ఎకరాకు రూ.1200 ప్రోత్సాహం

కూరగాయల విత్తనాలు కొనుగోలుకు ప్రభుత్వం ఎకరాకు రూ.1200 ప్రోత్సాహం అందిస్తోంది. ఈ మేరకు ఇప్పటికే జి. భీమవరం, కన్నూరుపాలెంలో సుమారు 40 మందికి ప్రోత్సాహం ఇచ్చేందుకు సిఫారసు చేశాం. పందిరిపై కూరగాయల సాగుకు హెక్టార్‌కు పెట్టుబడిగా రూ.20 వేల వరకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోంది. ఇందుకు అవసరమైన ధ్రువీకరణపత్రాలు అందించి రైతులు వినియోగించుకోవాలి.

–లావణ్య, ఉద్యానవన శాఖ అధికారి, అనకాపల్లి

ఆదాయం బాగుంది



చాలా కాలంగా కూరగాయలు సాగు చేస్తున్నాం. తాము పండించిన కూరగాయలను విశాఖనగరంలో రైతు బజారుకు తీసుకు వెళ్లి విక్రయిస్తున్నాం.మంచి ఆదాయం వస్తోంది. కూరగాయలు అమ్మగా వచ్చిన ఆదాయంతో జీవనం సాగిస్తున్నాం.

–లక్ష్మి, కూరగాయల రైతు, సుందరయ్యపేట, కశింకోట మండలం

క్వారీల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలి

- మృతుడి కుటుంబానికి నష్టపరిహారం రూ.50 లక్షలు చెల్లించాలి
- కార్మిక సంఘం నాయకుల డిమాండ్



మాట్లాడుతున్న కోన మోహన్

అనకాపల్లి: ప్రమాదాలను నివారించేందుకు క్వారీల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలని, బవులవాడలో శ్రీ వెంకట శశిస్టోన్ క్రషర్‌లో మంగళవారం రాత్రి జరిగిన ప్రమాదంలో మృతి చెందిన లారీ క్లీనర్ గాలి సూరిబాబు కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారం చెల్లించాలని జిల్లా క్వారీ క్రషర్స్ కార్మిక సంఘం నాయకులు కోన మోహన్, జి.సూర్యారావు డిమాండ్ చేశారు. స్థానిక క్వారీలో బుధవారం కార్మికులతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. క్వారీలో రాత్రి సమయంలో పనులు చేయడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, ప్రభుత్వ నిబంధనలు ప్రకారం పగటి సమయంలో మాత్రమే పనులు నిర్వహించే విధంగా మైనింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. క్వారీల్లో విధులు నిర్వహిస్తున్న సమయంలో కార్మికులకు తగిన భద్రత కల్పించాలని కోరారు. కార్మిక చట్టాలు అమలు కావట్లేదని, హక్కుల సాధన కోసం కార్మికులంతా సంఘటితంగా పోరాటాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నవ యువ సమాఖ్య జిల్లా నాయకుడు ఎస్.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఘంటసాల జయంతి



ఘంటసాల వెంకటేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ రాధిక

అనకాపల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు 102వ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఘంటసాల చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ జి.రాధిక పూలమాలలు వేసి నివాళులర్పించారు. అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం మాట్లాడుతూ 10వేల వరకూ పాటలు పాడి, తెలుగు వారి ఖ్యాతిని వ్యాపింపజేసిన మహనీయుడు ఘంటసాల అని తెలిపారు. స్వాతంత్ర్య పోరాటంలో వెంకటేశ్వరరావు జైలు శిక్ష అనుభవించినట్టు చెప్పారు. అంతకు ముందు కళాశాల విద్యార్థులకు ఘంటసాల పాటలపై పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పిరాట్ల నరసింహమూర్తి, పట్నాల కృష్ణ మోహన్, రొబ్బి మల్లేశ్వరరావు, బొడ్డు సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు



జాతీయ రహదారిపై కూడలిని పరిశీలిస్తున్న అనకాపల్లి డీఎస్పీ శ్రావణి



కేఎస్ఆర్.పేటలో పరిశీలిస్తున్న రూరల్ సీఐ అశోక్ కుమార్, జిల్లా ఇన్‌చార్జ్ డీటీ కె.వి.ప్రకాష్‌రావు

కశింకోట: జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అనకాపల్లి డీఎస్పీ ఎం. శ్రావణి తెలిపారు. రోడ్డు రవాణా, రోడ్లు, భవనాల శాఖ, నేషనల్ హైవే అథారిటీ అధికారులతో కలిసి జాతీయ రహదారిపై మండలంలోని నూతలగుంటపాలెం, నరసింగబిల్లి, చింతలపాలెం, గొబ్బూరు, తాళ్లపాలెం, ఎ.ఎస్.పేట, పరవాడపాలెం, జమాదులపాలెం, బయ్యవరం, కశింకోటల్లో ప్రమాదకర కూడళ్లను బుధవారం పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో ట్రాఫిక్ నిబంధనలను సూచించే బోర్డులు, స్టాప్ బోర్డులు, ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న గ్రామాల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాలను నివారించాలని అధికారులకు సూచించారు. సీఐ అల్లు స్వామినాయుడు, ఎంటీఐ ప్రకాష్, నేషనల్ హైవే అథారిటీ, ఆర్ అండ్ బి సిబ్బంది పాల్గొన్నారు.

అనకాపల్లి: మండల పరిధిలో పిసినికాడ, కె.ఎస్.ఆర్‌పేట రహదారిలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రదేశాలను రూరల్ సీఐ అశోక్‌కుమార్, జిల్లా ఇన్‌చార్జ్ రవాణాశాఖ అధికారి కె.వి.ప్రకాష్‌రావు, జాతీయ రహదారి అధికారులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు



నిందితుడితో ప్రొహిబిషన్, ఎక్సైజ్ పోలీసులు

తుమ్మపాల: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని ప్రొహిబిషన్, ఎక్సైజ్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. మండలంలో పిసినికాడలో మరిడిమాంబ అమ్మవారి ఆలయం వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్టు అందిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వై.ఎల్.నాయుడు ఆధ్వర్యంలో నిఘా పెట్టి పిల్లి తలుపులు అనే వ్యక్తిని పట్టుకుని, 10 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ లక్ష్మునాయుడు తెలిపారు. అదేవిధంగా మునగపాక మండలానికి చెందిన 20 మంది పాత నిందితులను తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసినట్టు సీఐ చెప్పారు.

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



పిసినికాడలో రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారి రంగాచారి

అనకాపల్లి: వరిలో సస్యరక్షణచర్యలు చేపట్టాలని వ్యవశాయశాఖ అధికారి పి.రంగాచారి తెలిపారు. మండలంలో పిసినికాడ, సత్యనారాయణపురం గ్రామాల్లో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను, అధిక వర్షాల సమయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని, వరి పంటను రక్షించుకునేందుకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. పిగులు పొట్ట, పూత దశలో ఉన్న వరిపైరు 1 నుంచి 2 రోజుల కన్నా ఎక్కువ రోజులు నీటమునిగితే కంకిపూర్తిగా బయటకు రాకపోవడం, పుష్పాలలో నీరు చేరడం వల్ల ఫలదీకరణ శక్తి కోల్పోయి, వరి గింజ రంగు మారుపోతుందన్నారు. గింజ రంగు మారకుండా ఉండాలంటే లీటరు నీటికి ఒక గ్రాము కార్బండిజిం లేదా 1 మిల్లీలీటరు , ప్రొపికొనజోల్ మందును పిచికారీ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామాల వ్యవసాయ సహాయకులు పార్వతి, లలిత, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా గౌరీపరమేశ్వరుల నిమజ్జనోత్సవం



గౌరీపరమేశ్వరుల ఊరేగింపు



మహిళల కోలాటం

కశింకోట: స్థానిక గవరపేటలో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో నెలకొల్పిన గౌరీపరమేశ్వరుల(గౌరమ్మ) నిమజ్జనోత్సవం బుధవారం రాత్రి ఘనంగా జరిగింది. కార్తీక మాసం సందర్భంగా గౌరమ్మను నెలకొల్పారు. కార్తీక మాసం పూజలు ముగియడంతో ఆది గౌరమ్మను ట్రాక్టర్‌పై నిలిపి గ్రామ వీధుల్లో డప్పులు, వాయిద్యాలు, మహిళల కోలాటాలతో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు గౌరమ్మను దర్శించుకున్నారు. పెద్ద ఎత్తున బాణ సంచా కాల్చారు. ఊరేగింపు అనంతరం స్థానిక పెద్దగుమ్మం వీధిలో శారదానదిలో గౌరమ్మ విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త భీశెట్టి దుర్గానాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల పనివేళల మార్పు తగదు



ఏడీ రమాజ్యోతికి వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నబ్బాయి

అనకాపల్లి: ప్రభుత్వ పాఠశాలల పనివేళల మార్పు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, పనివేళల మార్పు వల్ల విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి అన్నారు. ఈ మేరకు కొప్పాక డీఈవో కార్యాలయంలో విద్యాశాఖ ఏడీ రమాజ్యోతికి బుధవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ అధికారులు అసంబద్ధ నిర్ణయాలు తీసుకుంటున్నారని తెలిపారు. పాఠశాలల పనివేళలు పెంపు నిర్ణయాన్ని పైలట్ ప్రాజెక్టుగా జిల్లాలో 30 పాఠశాలల్లో చేపట్టారని చెప్పారు. ఒక మండలంలో 10శాతానికి మించి ఉపాధ్యాయులు సెలవులు పెట్టరాదని ఆంక్షలు విధించడం ఏంటని అయన ప్రశ్నించారు. పదవ తరగతి పరీక్షలకు సంసిద్ధత పేరుతో రాష్ట్ర ఎస్సీఈఆర్టీ అధికారులు విడుదల చేసిన 100 రోజుల యాక్షన్‌ప్లాన్‌తో ఉపాధ్యాయులను సెలవు రోజుల్లో కూడా పాఠశాలలకు రమ్మనడం విచిత్రంగా ఉందన్నారు. సంక్రాంతి సెలవుల్లో ఉపాధ్యాయులు పాఠశాలల్లో పని చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని, మరో పక్క ప్రభుత్వం సెలవు దినాల్లో విద్యార్థులకు ఏరకమైన తరగతులు నిర్వహించకూడదని ఆదేశాలు ఇస్తూ ఉపాధ్యాయులపై ఒత్తిడి చేయడం అన్యాయమన్నారు. ప్రభుత్వం నిర్ణయాలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈనెల 11న జిల్లా విద్యాశాఖ కార్యాలయం వద్ద, 16న రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయం వద్ద నిరసన తెలియజేయనున్నట్టు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి, సహఅధ్యక్షురాలు రొంగలి అక్కునాయుడు, జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రాజునాయుడు, వివిధ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హిందువులపై దాడులకు వ్యతిరేకంగా ర్యాలీ



డీఆర్‌వో దయానిధికి వినతిపత్రం అందజేస్తున్న విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు

అనకాపల్లి: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరిగిన దాడులకు వ్యతిరేకంగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పట్టణంలో సుంకరమెట్ట జంక్షన్ నుంచి శారదానది బ్రిడ్జి వరకూ బుధవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో డీఆర్‌వో దయానిధికి వినతిప్రతం అందజేశారు. హిందువులపై దాడులు చేయడం అన్యాయమని, బంగ్లాదేశ్‌లో జరిగిన దాడులకు ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.పరమేశ్వరరావు, విశ్వహిందూ పరిషత్ జిల్లా ప్రతినిధి శ్రీకాళహస్తి తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలి

డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శచీదేవి



డ్వాక్రా సంఘాల సభ్యులతో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శచీదేవి

రాంబిల్లి (యలమంచిలి): సూక్ష్మ మధ్యతరహా పరిశ్రమల ద్వారా మహిళలు ఆర్థికంగా పురోగతి సాధించాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శచీదేవి అన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు పొంది రాంబిల్లి మండలంలో ఏర్పాటు చేసిన చిన్నతరహా పరిశ్రమల యూనిట్లను ఆమె బుధవారం పరిశీలించి, పలు సూచనలు సలహాలు అందించారు. ప్రభుత్వం అందజేస్తున్న రుణాలతో స్వయం ఉపాధి పొందుతున్న డ్వాక్రా సంఘాల సభ్యులతో మాట్లాడారు. అనంతరం రాంబిల్లిలో మహిళా సమాఖ్య స్త్రీశక్తి భవనంలో రికార్డులు తనిఖీ చేశారు.ఈ కార్యక్రమంలో ఏపీఎం పద్మ, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వరి కోతలు వాయిదా వేసుకోవాలి



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో సూచనలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

పాయకరావుపేట: రానున్న మూడు నాలుగు రోజుల్లో భారీగా వర్షాలు కురిసే సూచన ఉన్నందున రైతులు వరి కోతలు వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి పి.ఆదినారాయణ తెలిపారు.మండలంలోని సత్యవరంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా క్షేత్ర సందర్శన, రైతులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి మాట్లాడుతూ కోసిన పంటలను త్వరగా కుప్పలు పెట్టుకోవాలని సూచించారు. రైతులు పంటల దిగుబడి పై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం, వ్యవసాయ పథకాల కోసం రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త శ్రీహరిరావు, వెటర్నరీ డాక్టర్ సాయి శంకర్, గ్రామ ఉద్యానవన సహాయకులు అజయ్, అమృత, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన పరిహారం చెల్లించాలి

మునగపాక: పూడిమడక రోడ్డు విస్తరణలో నష్టపోతున్న మునగపాక రెవెన్యూ పరిధిలోని బాధితులకు మెరుగైన పరిహారం అందించాలని పలువురు కోరారు. స్థానిక పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో రహదారి విస్తరణ బాధితులు సమావేశమై ఈ మేరకు తీర్మానించారు. గత ప్రభుత్వ హయాంలో గజానికి రూ.4వేలు ఇస్తామని చెప్పారని, అయితే ఇప్పుడు మార్కెట్‌లో పెరిగిన ధరలకు అనుగుణంగా గజానికి రూ.9వేల చొప్పున పరిహారం అందించాలని కోరారు ప్రభుత్వం పునరాలోచన చేసి పరిహారాన్ని పెంచేలా చూడాలన్నారు. పెంటకోట జగన్నాథరావునాయుడు, బొడ్డేడ సోమసుందర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాతో రక్ష



కొరుప్రోలు ఎంఎల్‌హెచ్‌పీ కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న చంద్రశేఖర్‌దేవ్

ఎస్.రాయవరం: చిన్నారులకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధిక టీకాలు వేయించాలని, అది రక్షణ కల్పిస్తుందని జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ కె.చంద్రశేఖర్‌దేవ్ అన్నారు.కొరుప్రోలు, పెదగుమ్ములూరు గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు టీకాలు వేస్తున్న కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకుంటే, బిడ్డ 2.5 కేజీల బరువుతో పుట్టి, సంపూర్ణ ఆరోగ్యవంతంగా ఉంటాడన్నారు. ప్రతి బిడ్డను సంరక్షించుకోవడానికి పుట్టి నాటి నుంచి 6 నెలల పాటు సహజసిద్ధంగా లభించే ముర్రుపాలు పట్టాలని సూచించారు. ముర్రుపాల వల్ల బిడ్డకు వ్యాధినిరోధిక శక్తి పెరిగి,మానసిక, శారీరక ఎదుగుదల బాగా ఉంటాయన్నారు. బిడ్డలకు రాత్రుళ్లు కనీసం నాలుగు సార్లు తల్లిపాలు ఇవ్వడం చాలా మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ పి.శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహా ధర్నాను విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ నేతలు

అచ్యుతాపురం: సీపీఎస్ రద్దు కోసం ఈనెల 10న విజయవాడలో ఉపాధ్యాయులు నిర్వహిస్తున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని ఏపీసీఎస్‌ఈఏ జిల్లా ప్రధాన కార్యదర్శి మోటూరు త్రినాథ్ స్వామి కోరారు. ఈ కార్యక్రమంపై ముద్రించిన వాల్‌పోస్టర్లను బుధవారం అచ్యుతాపురంలో ఆవిష్కరించారు. ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీని ఈ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని, పాత పింఛన్ విధానం అమలు చేయాలని ఆయన కోరారు. పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని,పీఆర్‌సీపై ప్రకటన చేయాలని కోరారు. ఏపీటీఎఫ్ నాయకులు బొత్స వెంకటేశ్వరరావు,పట్నాల నాగేశ్వరరావు,మద్దిల నానాజీ,నక్క అప్పలనాయుడు,కృష్ణ, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరానికి స్పందన



పశువులకు చికిత్స చేస్తున్న వైద్యులు

ఎస్.రాయవరం: మండలంలోని వేమగిరిలో బుధవారం నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. 35 పశువులకు గర్భకోశవ్యాధికి చికిత్స చేశారు. 14 పశువులకు చూడి పరీక్షలు,32 పశువులకు సాధారణ చికిత్స అందించారు. 30 పెయ్యిల యజమానులకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పశుసంవర్ధకశాఖ నక్కపల్లి సబ్ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.వీర్రాజు మాట్లాడుతూ పశువులకు వ్యాధులు సంక్రమిస్తే సకాలంలో వైద్య సేవలందించాలని సూచించారు. అనంతరం పశువుల్లో పాలఉత్పత్తిని పెంచే మినరల్ మిక్సర్ ప్యాకెట్లు,లివర్ టానిక్‌లు పంపిణీ చేశారు.లింగరాజుపాలెం పశువైద్యాధికారి కె.భరత్‌కుమార్, పి.భాను, డి.వంశీకృష్ణయాదవ్,ఎస్.సౌజన్య, వీఎల్‌వోలు ,గోపాల్ మిత్రలు,గ్రామసర్పంచ్ ముప్పిన అబ్బాయిదొర పాల్గొన్నారు.